# క్షణక్షణమూ...

## డా॥ కొత్త రవీంద్రబాబు

**"ప్రతిమా! అదిగో ఆ కనపడేదే అమర్ కోట! కొంచెం ఓపిక తెచ్చుకున్నావంటే గంట సేపట్లో చరిత్ర ప్రసిద్ధి చెందిన ఆ కోట చూచి రావచ్చు!" బతిమిలాడుతున్నట్లు అడిగాడు నీలకాంత్.**

**"అమ్మో! నావల్ల కాదు! కాళ్ళు నెప్పెడుతున్నాయి. అడుగు ముందుకు వెయ్యలేను! మీరు వెళ్ళి రండి!"**

"ఫర్లాంగు నడిచావంటే చక్కగా ఏనుగు అంబారీ మీద కూర్చుని కోట మొత్తం చూచి రావచ్చు! రావోయ్!"

"ఊహు! తల తిరిగిపోతుంది! రాజస్థాన్‌లో ఎండ మాడ్చి వేస్తున్నది! కళ్ళు తిరుగుతున్నాయ్!"

"అదేమిటోయ్! ఎప్పుడూ విశాఖపట్నంలో పడివుండడమేనా? దేశం నాలుగు మూలలు తిరిగివద్దాం అని సంవత్సరం నుండి అడుగుతున్నావు! తీరా శెలవు దొరికి జైపూర్ వచ్చేసరికి ఇలా నీరు గారిపోయావు! ఫ్లాస్క్‌లో కాఫీ వుంది కొంచెం తాగి పది నిముషాలు రెస్ట్ తీసుకో. బయల్దేరుదాం!"

"నేను రాలేను బాబూ! మీరు వెళ్ళి రండి!"

"అంతేనంటావా? నిన్ను వంటరిగా వదలి వెళ్ళమంటావా?"

"ఇంత దూరం వచ్చి కోట చూడకుండా వుంటారా? మీరు ఎప్పట్నుంచో అమర్ కోట చూడాలనుకునేవారు! మీరు వెళ్ళి చూసిరండి!"

"ఊహు!"

"మీరు చూసి వచ్చి నాకు వివరంగా చెబుదురుగాని! అప్పటివరకు నేను ఆ కనపడే మందిరంలో కూర్చుంటాను."

"సరే! నువ్వు కాసేపు విశ్రాంతి తీసుకో! అరగంటలో కోట చూచి వస్తాను!"

ప్రతిమను కృష్ణమందిరం వద్ద దిగబెట్టి ముందుకు వెళ్ళాడు నీలకాంత్! అతనికి చరిత్ర ప్రసిద్ధి పొందిన ప్రదేశాలను చూడాలనే కుతూహలం ఎక్కువ!

నిజానికి హంపీ శిథిలాలను చూస్తున్న సమయంలోనే ప్రతిమ నీలకాంత్‌కు మొదటిసారి పరిచయం అయింది. ఆంధ్రా యూనివర్సిటీ విద్యార్థినీ విద్యార్థులు దసరా శెలవలకు హంపీ వెళ్ళారు ఆ సంవత్సరం.

బోటనీ ఎం.ఎస్‌సి. చదువుతున్న ప్రతిమ, హిస్టరీ ఎం.ఎ. చదువుతున్న నీలకాంత్ ఒకరికొకరు పరిచయమైంది అక్కడే!


ప్రతిమ కలుపుగోలు స్వభావం నీలకాంత్‌ను, నీలకాంత్ ప్రశాంత గంభీర ప్రవృత్తి ప్రతిమను ఆకర్షించింది!

రెండు యువ హృదయాల మధ్య మొదలైన స్నేహభావం త్వరలో వృద్ధి చెంది గాఢతర ప్రేమపాశంగా మారింది!

విరుద్ధ స్వభావాల మధ్య మొదలయ్యే ప్రణయం త్వరగా వృద్ధి చెందుతుందంటారందుకే!

నీలకాంత్‌కు బాంకు ఉద్యోగం, ప్రతిమకు లెక్చరర్ ఉద్యోగం రాగానే రిజిస్ట్రార్ ఆఫీస్‌కు వెళ్ళి పెళ్ళి చేసుకున్నారు!

నీలకాంత్ ప్రతిమల స్వభావాలలాగే వాళ్ళ కుటుంబాలు



కూడా విరుద్ధ వాతావరణాలకు చెందినవి!

నిప్పుల్ని కడిగే పరమ ఛాందస కుటుంబం నీలకాంత్‌ది. కుల మతాలతో నిమిత్తం లేకుండా ఎవరు బడితేవారు వచ్చి వెళుతుండే కాస్మోపాలిటన్ వాతావరణానికి అలవాటు పడ్డది ప్రతిమ కుటుంబం!

అందుకే గప్‌చిప్‌గా వివాహం చేసుకుని డాబా గార్డెన్సులో చిన్న యిల్లు అద్దెకు తీసుకుని కాపురం పెట్టారు నవ దంపతులు, పెద్దలు ఏమనుకుంటారో అని పట్టించుకోకుండా!

కొత్తగా కాపురం పెట్టిన మొదటి రోజు-

"నీల్! కాఫీ యిదిగో!" అంటూ చెలాకీగా బెడ్‌రూంలోకి అడుగిడిన ప్రతిమ నీలకాంత్ ముఖం నిర్లిప్తంగా వుండడంతో ఆలోచనలో పడిపోయింది!

"నీలకాంత్ వాళ్ళది శ్రోత్రియ కుటుంబం! భార్య భర్తను పేరు పెట్టి పిలవడం అతనికి నచ్చదు కాబోలు!" అనుకుంటూ కాఫీ కప్పు భర్తకందించి వెళ్ళిందామె.

అప్పట్నుంచీ భర్తను "మీరు" అని రిజిస్టరు మారేజికి ముందు పిలిచినట్టే పిలవసాగింది ప్రతిమ.

ఒకరి స్వభావాలను ఒకరు అర్థం చేసుకుని సర్దుకుపోవాలనే దృక్పథం ఇద్దరిలోనూ వుండడతో కాపురం పొరపొచ్చాలు లేకుండా సాగిపోతున్నది.

"ప్రతిమా!"

"ఏమిటండీ?"

"వారం రోజులు శెలవు దొరికింది! నీకు ఎటు గూడి దసరా శెలవలిచ్చారు! ఏం చేద్దాం?"

"కాశ్మీర్ వెళదాం!?"

"ప్రతిమా నాకు ఎన్ని రోజులనుండో మనసులో ఒక కోరిక వున్నది!"

"ఏమిటండీ?"

"రాజస్థాన్‌లోని జైపూర్, జోధ్‌పూర్, బికనీర్, ఉదయ పూర్, భరత్ పూర్ చూడాలని చాలాకాలంగా అనుకుంటున్నాను!"

"అలాగే! రాజస్థాన్ వెళదాం! ఎక్కడికయితేనేం! ఈ విశాఖపట్నం అంటే మొఖం మొత్తిపోయింది! వీలున్నప్పుడు దేశం నాలుగు మూలలూ తిరిగి వద్దాం. ఈసారి రాజస్థాన్! వచ్చేసారి కాశ్మీర్"

"అలాగే ప్రతిమా!"

రైల్వే స్టేషన్‌కు వెళ్ళి ఫస్ట్‌క్లాస్ కూపే రిజర్వు చేయించుకుని వచ్చాడు నీలకాంత్!

వివాహం అయింతర్వాత మొదటసారి కలసి చేస్తున్న రైలు ప్రయాణం ఎంతో మధురంగా సాగింది.

"ప్రతిమా!"

"ఊ"

"నిన్ను చూస్తూ- నీ భువన మోహన రూపం విలోకిస్తూ వుంటే ఆకలి దప్పులు వేయటం లేదు!"

"అదేమిటి? శరీర ధర్మం తన పని తను చేసుకు వెళ్తుంది అంటారు! జైపూర్ వెళ్ళగానే డాక్టరుకు చూపించుకోండి! వంట్లో ఏదైనా సుస్తీ చేసిందేమో?"

"పిచ్చి ప్రతిమా! ప్రపంచంలోని అందం అంతా ఏర్చి కూర్చి పోదిగిన అపరంజి బొమ్మ నా సొంతం అయినప్పుడు ఆకలి ఎలా అవుతుంది!"

"సంవత్సరంగా నన్ను చూస్తూనే వున్నారు ఇంట్లో! అంతకు ముందు రెండు సంవత్సరాలుగా ఒకరి నొకరం యూనివర్సిటీ కాంపస్‌లో చూచుకుంటూనే వున్నాం! నా రూపం చూసి చూసి మీకు మొఖం మొత్తి వుంటుందను

కున్నాను మొన్ననే!"

"నెవర్ ప్రతిమా! నెవర్!"

"ఒకవేళ నాకంటే అందమైన అమ్మాయి కనపడితే? అప్పుడీ ప్రతిమను వదలి..."

"నో ప్రతిమా! నీ కంటే అందమైన అమ్మాయి ఈ ప్రపంచంలో లేదు!"

"రాజస్థాన్‌లో అందాల అతివలు ఎందరో ఎదురవుతారు! అప్పుడు మీ అభిప్రాయం మారుతుందేమో?"

"అందం అనేది చూసేవాడి మనఃచక్షువును బట్టి వుంటుంది! నా కళ్ళకు నీకన్నా అందమైన అమ్మాయి యింతకు ముందు కనపడలేదు! ఇక ముందు కనపడదు!"

"తానవలచినది రంభ అన్నారందుకే!"

"స్టేషన్ వచ్చింది! వెళ్ళి వాటర్ బాటిల్‌లో మంచి నీళ్ళు పట్టండి!"

"ఉహూ!"

"అదేమిటి? మీకు దాహం కాకపోతే పోయింది! నాకు యిందాకటి నుండి దప్పికగా వుంది!"

"నీ అందాన్ని చూసి రంభ సిగ్గుతో తలదించుకోవాలి!"

"ఆనక సర్వర్ మీల్స్ తెచ్చినప్పుడు ఎటు తిరిగి కూపే తలుపు తీయాలి! ఇప్పుడొకసారి, అప్పుడొకసారి ప్రతిమ సుందర రూప విలోకనానందానికి విఘాతం కలగటం నాకిష్టం లేదు!"

కూపే తలుపు తీయకుండా ఒకరిని చూస్తూ ఒకరు, ఒకరి సరసన ఒకరు, ఒకరి కౌగిలిలో ఒకరు. అలా గంటలు క్షణాలుగా గడిపి వేసారు.

ప్రతిమ నీలకాంత్‌ల ఆనందానికి అంతరాయం కల్గింది. రైలు జైపూర్‌లో ఆగింది.

రైలు దిగక తప్పలేదు. జైపూర్ స్టేషన్‌రోడ్డులో చంద్రకాంత్ హోటల్‌లో దిగారు నీలకాంత్, ప్రతిమ.

రాజస్థాన్ చూడాలని తహతహలాడిన నీలకాంత్ రూము వదలి బయటకు పోయే ప్రయత్నం చేయక పోవడంతో ప్రతిమ ఆలోచనలో పడింది.

నీలకాంత్‌కు రాజస్థానీ ఆర్కిటెక్చర్ అన్నా, పెయింటింగ్స్ అన్నా, విగ్రహాలన్నా ఎంతో మోజు. రాజస్థాన్‌లో చూడదగిన స్థలాలను, విశేషాలను చూడాలని ఎంతో ఆతురతతో బయల్దేరాడు. కాని విశాఖపట్నంలో రైలు ఎక్కిన దగ్గర్నుండీ దారిలో రైలుమారినా- పంచశరుని పూలబాణాలకు పాక్కి పోలిన నీలకాంత్ కొత్త పెండ్లికొడుకు కన్నా మిన్నగా కొంగు వదలక తిరుగుతుంటే ప్రతిమ మనసులో ఒకవైపు మధుర భావ తరంగాలు పుప్పొంగినా మరో వైపు 'ఇంత ఆనందం కలకాలం నిలిచివుంటుందా? చూచి చూచి నా రూపం నీలకాంత్ మనసులో వెగటు కల్గించదు గదా?' అనిపించేది.

తీరా జైపూర్ వచ్చాక కూడా మనుగుడుపు పెళ్ళికొడుకులా మంచం దిగకుండా కూర్చున్న భర్తను చూసి 'శెలవలు నాలుగు రోజులూ ఇలా గడిపి వేస్తే నీలకాంత్ విశాఖపట్నం వెళ్ళాక బాధపడ్తాడు. ఎలాగైనా నీలకాంత్‌ను హోటల్ రూం నుండి బయల్దేరతీయాలి!' అనుకుని

"తల తిరిగినట్లు వుంది. ఇవాళైనా టాక్సీలో జైపూర్ నాల్గు మూలలా తిరిగివద్దాం!" అంది.

"అలాగే ప్రతిమా" అన్నాడు నీలకాంత్.

సిటీ గేటు గుండా టాక్సీ లోపలకు వెళ్తుంటే నీలకాంత్ "ప్రతిమా అదే చంద్రమహల్. అదుగో ముబారక్ మహల్" అంటూ ఒకో ప్రదేశమూ చూపించసాగాడు.

"ప్రతిమా! చంద్రమహల్ లోపల చక్కటి పెయిం



టెంగ్స్ వున్నాయి! వెళ్ళి చూద్దాం!"

"నేను రాలేను బాబూ. మీరు వెళ్ళి చూచిరండి!" అంటూ చెట్టుక్రింద రాతి బెంచి మీద కూర్చుంది ప్రతిమ.

"సరే! నేను అరగంటలో తిరిగి వస్తాను!" అంటూ పాలెస్ లోపలకు వెళ్ళాడు నీలకాంత్.

'నేను పక్కన లేకపోతే చూడాలనుకున్నవన్నీ సరిగా చూస్తాడు. లేకపోతే మాటిమాటికి నా వంక చూస్తూ కాలం గడిపేస్తాడు. వున్న కొద్ది సెలవలూ అయిపోయాక తిరుగు ప్రయాణం చేయక తప్పదు!' అనుకుంటూ కూర్చుండి పోయింది ప్రతిమ.

*　　*　　*　　*

"ప్రతిమా అమర్‌కోట చూచివద్దామా!"

"అలాగేనండీ! ఇక్కడికెంత దూరం?"

"పదకొండు కిలో మీటర్లుంటుంది! టాక్సీలో వెళదాం!"

"అలాగే"

"'బయల్దేరు. ఉండు, ఫ్లాస్క్ యివ్వు! కాఫీ పోయించుకు వస్తాను!"

తీరా అమర్‌కోట దగ్గరకు వచ్చాక ప్రతిమ కాళ్ళు నొప్పులంటూ సీతపాట మొదలెట్టింది.

తను దగ్గర లేకపోతే నీలకాంత్ పరిశీలనగా కోటనంతా చూచివస్తాడనుకుంటూ కృష్ణ మందిరంలో స్తంభానికి జేరగిల బడి కూర్చుంది. నిజానికి రాజస్థాన్‌లో ఎండను భరించడం ఆమెకు చికాకుగానే వుంది.

*　　*　　*　　*

"అక్కా! నువ్వు... నువ్వు... ప్రతిమక్కవు కదూ?"

"ఎవరూ?" ఎదురుగా చినిగిన చీర కట్టుకుని పద్దెనిమి దేళ్ళ అమ్మాయి వంక చూస్తూ వుండిపోయింది ప్రతిమ. ఒడలిన దేహం, డస్సిపోయిన ముఖం, తైల సంస్కారం లేక అట్టకట్టిన జుట్టు చచ్చిన చేపల జంట లాంటి కళ్ళు- చలన రహితంగా వున్న ఆ కళ్ళలోకి క్రమంగా వెలుగు రావడం గమనించిన ప్రతిమకు ఆ క్షణాన ఎదుట వున్న వ్యక్తి గుర్తు వచ్చింది.

"నువ్వా రాణీ!"

"అక్కా!"

"ఏమిటీ వేషం? ఇక్కడెందుకున్నావు?"

"అక్కా! మోహన్ మెరమెచ్చు మాటలు విని ఇంట్లో చెప్పకుండా అతని వెంట వచ్చాను. వంటి మీద బంగారం కరిగిపోయింతాకా పగలే వెన్నెల కాయించాడు. సొమ్ములు కరిగిపోయాక చీకట్లో మాయమైపోయాడు!

మోహన్ మాయమై వారం రోజులైంది. సూట్‌కేస్, బట్టలు తీసుకుని హోటల్ వాళ్ళ వెళ్ళగొట్టారు.

దేవాలయాలలో దయతల్చి పెడుతున్న ప్రసాదాలు తిని కడుపునింపుకుని కాలక్షేపం చేస్తున్నాను.

దేశం కాని దేశంలో చేతిలో చిల్లిగవ్వ లేకుండా దిక్కు లేని పక్షిలా తిరిగాను. రైలులో ఇంటికి వెళదామని ప్రయత్నిం చాను. టి.సి. పట్టుకు తరిమేసాడు.

ఈ రోజు అమర్‌కోట బురుజు నుండి దూకి చనిపోదాం అనుకున్నాను. నా అదృష్టం కొద్దీ నువ్వు కనపడ్డావు."

"రాణీ దిగులు పడకు. నిన్ను క్షేమంగా మీ యింటికి చేరుస్తాను."

"వద్దక్కా, అమ్మా నాన్నా ఏమంటారో!"

"ఏమీ అనరు! నేను స్వయంగా వచ్చి నిన్ను మీ ఇంట్లో దిగబెడతాను! సరేనా?"

## నిర్ధూమ దీపాలు

ఈ దీపం కృషీవలుల శ్రామిక జన ప్రతిరూపం
ఎదుగూ బొదుగూ లేదని విడుస్తోంది బహు ధూపం

ఈ దీపం నిరుద్యోగ యువజన ఆర్త స్వరూపం
ఏ దారీ కనరాదను నిస్పృహ ధూమోపేతం

ఈ దీపం తనివారని రాజకీయ పద దాహం
ఇంకా పై కెదగాలను స్వార్థ ధూమావృతం

ఈ దీపం అవినీతి స్నేహ సుసంపర్కితం
ఎడతెరపిలేక సృజిస్తున్నది పొగమబ్బుల నిత్యం

ఈ దీపం స్వార్థ రహిత సత్యసహిత జన హృదయం
నిర్ధూమంగా వెలిగే నిష్కల్మష స్వరూపం

పొగలు కక్కు దీపాలీ భువిలో మెండైనాయి
భరతమాత కనుల నశ్రుధారలనే నింపాయి

ఇది తరుణం చేయి కలుపు తమ్ముడా ఓ చెల్లెలా!
ఈ దుస్థితి తొలగిద్దాం ఈ పొగలను తరిమేద్దాం

నిఖిల ప్రజా హృజ్జ్యోతులు నిర్ధూమంగా వెలిగే
మార్గాలన్వేషిద్దాం

అప్పుడు వెలుగులు నిండిన అవని భరత భూమే
అని విశ్వానికి చూపిద్దాం

మనసుంటే వుంది మార్గం
భరత భూమే భావి స్వర్గం

—సూర్యదేవర రవికుమార్

"ప్రతిమా! ఎవరీ అమ్మాయి?"

"అప్పుడే వచ్చారే! ఈ అమ్మాయి పేరు రాణి. విజయ వాడలో మా నాన్నగారు పనిచేస్తున్నప్పుడు మా పక్క యింట్లో వుండేవాళ్ళు. 'అక్కా' అంటూ నేనంటే ఎంతో ఆప్యాయంగా వుండేది!"

"అలాగా! మరి యిప్పుడు?..."

"ఆ సంగతులన్నీ తర్వాత మాట్లాడుదాం. ముందు మనం హోటల్‌కు వెళ్ళాలి! రండి! టాక్సీ పిలవండి."

టాక్సీ చంద్రకాంత్ హోటల్ ముందాగింది. ప్రతిమ నీలకాంత్‌ల వెంట వెళ్తున్న రాణి వంక వింతగా చూసాడు రిసెప్షన్ క్లర్కు.

"రాణీ! పోయి స్నానం చేసిరా!"

"అక్కా... ..."

"నా చీర కట్టుకుందువుగాని! పోయి తలారా స్నానం చేసిరా! ఈ లోపల రూమ్‌కు భోజనం తెప్పిస్తాను."

"అక్కా!"

"ఏడవకు రాణీ! జరిగిపోయిందానికి విచారపడకు! నూరేళ్ళ జీవితం ముందున్నది! పీడకల లాంటి చెడు సంఘటనను గుర్తు తెచ్చుకోకు!"

*　　*　　*　　*

"ప్రతిమా! హాయిగా ఆనందంగా మనిద్దరం టూర్ చేస్తుంటే మధ్య పానకంలో పుడకలా ఈ అమ్మాయిని తీసుకు వచ్చావేమిటి?"

"రాణికి నేనంటే ఎంతో అభిమానం. వాళ్ళది కలిగిన కుటుంబం. దురదృష్టవశాత్తు ఆమెకు దిక్కులేని స్థితి ఏర్ప డింది. మనం సంతోషంగా వున్నప్పుడు అదృష్ట హీనులైన నిర్భాగ్యులకు కొద్దిపాటి సాయం చేయటంలో తప్పేం వుంది?"

"ప్రతిమా! సంవత్సరం కష్టపడితే ఇప్పటికి సెలవు తీసు కుని టూర్‌కు రాగలిగాం! ప్రతిక్షణం అమూల్యమైన ఈ సమయంలో మన మధ్య మరో వ్యక్తి రావటం బాగాలేదు!"

"నెమ్మదిగా మాట్లాడండి! రాణి వింటుంది! దిక్కులేని ఆ నిర్భాగ్యురాలిని వాళ్ళింటికి జేర్చితే నా బాధ్యత తీరు తుంది."

"రాణీ! రా, ఇలా కూర్చో. తల చిక్కు తీస్తాను" అంటూన్న ప్రతిమ వంక చిరాకుగా చూసి బయటకు వెళ్ళాడు నీలకాంత్.

ప్రతిమ రాణి తల దువ్వి జడవేసింది. బాల్య స్నేహితు రాలిని ఆపదలో ఆదుకున్నానన్న ఆనందం ఆమెకు ఎంతో సంతృప్తినిచ్చింది. ఆమెకు మరో సంతృప్తి కూడా దొరికింది.

రాణి గదిలో వున్నందువలన ప్రతిమ-నీలకాంత్ నిరంతర ప్రణయానికి బ్రేక్ పడింది. నీలకాంత్ ఇప్పుడు జైపూర్‌లోని అనేక కోటలను, మ్యూజియంలను చూస్తూ కాలం గడుపు తున్నాడు. రాణి రూంలో వుండకపోయినట్లయితే అతను రూం నుండి బయల్దేరటానికి అంత వుత్సాహం చూపేవాడు కాదు. "టూర్ నాలుగు రోజులు వ్యర్థమైపోయాయి" అని విశాఖపట్నం వెళ్ళాక వాపోయేవాడు. ఇంపల్సివ్‌గా ప్రవర్తిం చడం, ఆనక బాధపడటం అతనికలవాటే!

హవా మహల్‌ను తనివితీరా చూచి, ఆనందంగా హోటల్ రూముకు తిరిగి వచ్చాడు నీలకాంత్.

"అబ్బా! అమ్మా!" మంచం మీద పడుకుని మూలుగు తున్నది ప్రతిమ.

"ప్రతిమా! ఏమయింది?"

"అక్కకు విపరీతంగా జ్వరం వచ్చింది." దిగులుగా అంది రాణి.

"అలాగా. ప్రతిమా! రా వెళ్దాం! డాక్టరు గారికి చూపి స్తాను. పక్క వీధిలో క్లినిక్ వుంది"

"అక్కర్లేదండి. రెండు ఆస్ప్రిన్ బిళ్ళ లివ్వండి. అదే తగ్గుతుంది!"

ప్రతిమ మాటలు వినకుండా వెళ్ళి డాక్టరును పిలుచుకు

ఇచ్చాడు నీలకాంత్.

"ఫ్లూ జ్వరం! తగ్గటానికి రెండు రోజులు పట్టవచ్చు!" అన్నాడు డాక్టరు.

"అక్కా" అంటూ రాణి, "ప్రతిమా" అంటూ నీలకాంత్ మంచానికి చెరో వైపున కూర్చుని వుండిపోయారు.

రెండు రోజులు గడిచాయి. ప్రతిమకు జ్వరం తగ్గింది. కాని నీరసంగా వుంది. కనులు మూసుకునే వుండాలనిపిస్తున్నది.

కనులు కొద్దిగా తెరచింది ప్రతిమ. మంచం పక్కన నీలకాంత్ లేడు.

టీపాయ్ ముందు కూర్చుని వున్నాడతను. రాణి అన్నం వడ్డిస్తున్నది.

నీలకాంత్ రాణి వంక చూస్తున్నాడు. రాణిది కనులు మిరుమిట్లు గొలిపే అందం. నీలకాంత్ సౌందర్యారాధకుడు.

"నీ అందం నన్ను పిచ్చివాడిని చేస్తుంది ప్రతిమా!" అని ఎన్నోమార్లు నీలకాంత్ అనటం గుర్తొచ్చింది.

"నీలకాంత్‌ను పిచ్చివాడిని చేస్తున్నది నేను కాదు- నా అందం. రాణి నాకంటే అందగత్తె! పద్దెనిమిదేళ్ల నడుచు వయసులో మిసమిసలాడుతుంది."

ప్రతిమ కనుకొలకులలో నీరు నిండింది. నీలకాంత్‌ను మాడసాగిందామె. రాణిని తదేకంగా చూస్తున్నాడతను.

ప్రతిమ మనసులో ఏదో భయం మెదలసాగింది.

లేచి నిలబడింది ప్రతిమ. ఒంట్లోని ఓపికనంతనూ




కూడగట్టుకుని ముందుకు నడిచింది.

"అరే ప్రతిమా! లేచావేం"

"ఏం కావాలక్కా?"

"ఏమీ లేదు! బాగానే వుంది. జ్వరం తగ్గింది కదా, కొంచెం అన్నం తింటాను!"

"వద్దు ప్రతిమా! అప్పుడే పథ్యం పుచ్చుకోవటం మంచిది కాదు. ఉండు బజారుకు వెళ్ళి యాపిల్స్ పట్టుకొస్తాను." అంటూ బయటకు వెళ్ళాడు నీలకాంత్.

*  *  *  *

ఆపిల్స్ బుట్ట చేత బుచ్చుకుని హోటల్ గదిలోనికి వచ్చిన నీలకాంత్ "రాణీ! యాపిల్ కడిగి అక్కకివ్వు" అన్నాడు.

రాణీ కనపడలేదు. బదులు పలుకలేదు. సోఫాలో కూర్చున్న ప్రతిమ "రాణీ లేదు" అంది నీరసంగా.

"ఏమయింది?"

"విజయవాడ వెళ్తానంది. ఛార్జీలకు డబ్బిచ్చి పంపాను."

"రాణి ఇంకా రెండు రోజులుంటే బాగుండేది. నీకు నీరసం తగ్గిపోయేదీలోపం!"

"నాకేం నీరసం గా లేదు. అయినా రాణి ఇంటికి వెళ్ళాలని తొందర పెట్టింది!"

"అలాగా! పోతే పోయిందిలే! ఇదిగో ఈ యాపిల్ ముక్కలు తిను."

నీలకాంత్ యాపిల్ ముక్కలు తినిపిస్తుంటే ఒకో ముక్కా తింటూ సంతృప్తిగా నిట్టూర్చింది ప్రతిమ.

'రాణిని కట్టుబట్టల్తో రైలు ఛార్జీలకు సరిపడా డబ్బిచ్చి పంపించి వేసాను!' అన్న ఆలోచన ఆమెను బాధించటం మానివేసింది. 'నా నీలకాంత్‌ను నేను దక్కించుకున్నాను! గుండెల మీద కుంపటిలా ఎదురుగా కనపడే ప్రలోభాన్ని వదిలించుకోగల్గాను!' అనుకుందామె ఆ క్షణాన.


దీపావళి శుభాకాంక్షలతో

సత్య బార్ అండ్ రెస్టారెంట్

వీరాస్వామి మండి వీధి,

కడప

ఫోన్: 3275

న్యూ గౌతమ్ వైన్స్

కడప